అక్షరశక్తి
The Power of Pen
Evening Daily

సంపుటి: 20 | సంచిక: 309 | వరంగల్ | బుధవారం, 15 సెప్టెంబర్ 2026 | పేజీలు: 08



# డ్యూటీలకు దుమ్మా!

### ఈఎస్ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎక్కడ..?

- ఆస్పత్రిలో వైద్య సేవలు మృగ్యం
- నెలకోసారి చుట్టుపుచూపుగా ఉన్నతాధికారి రాక
- ఆస్పత్రి బాధ్యతలు ఓ వైద్యుడికి అప్పగించి ఆన్‌లైన్‌లో పర్యవేక్షణ
- వైద్యులు విధులకు రాకున్నా వంద శాతం హాజరు
- మొత్తం 10 మంది డాక్టర్లు.. విధుల్లో ఉండేది ఇద్దరే
- నర్సులు, అటెండర్లతోనే ఆస్పత్రి నిర్వహణ..
- మధ్యాహ్నం తర్వాత వారు కూడా గాయబ్
- శస్త్రచికిత్సలన్నీ ఎంజీఎంకు రెఫర్..
- ప్రశ్నార్థకంగా కార్మికుల ఆరోగ్య భద్రత



కార్మిక రాజ్య బీమా సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరంగల్ ఈఎస్ఐ ప్రాంతీయ వైద్యశాల నిర్వహణ గాడితప్పింది. ఆస్పత్రిని పర్యవేక్షించాల్సిన ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కాంతి సాగర్ ఆస్పత్రికి క్రమం తప్పకుండా హాజరు కాకపోవడంతో పరిపాలన పూర్తిగా అస్తవ్యస్తమైంది. వరంగల్ గొర్రెకుంట ఈఎస్ఐ ఆస్పత్రికి నెలకోసారి వచ్చి చుట్టుపుచూపుగా వెళ్లిపోతున్న సూపరింటెండెంట్ కాంతి సాగర్ ఆస్పత్రి బాధ్యతలను ఓ వైద్యుడికి అప్పగించి ఆన్‌లైన్‌లోనే పర్యవేక్షిస్తున్నారు. దీంతో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఉద్యోగులపై నియంత్రణ లేకుండా పోయింది. విధులకు రాని వైద్యులు, సిబ్బందికి సైతం హాజరు రికార్డుల్లో వంద శాతం హాజరు నమోదవుతోంది. నెలనెలా ఉన్నతాధికారులకు మామూళ్లతో వ్యవహారం మేనేజ్ అవుతుండటంతో ఆస్పత్రి నిర్వహణపై ఎలాంటి పర్యవేక్షణ లేకుండా పోయింది. కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యం అందించాల్సిన ఆస్పత్రిలో ప్రస్తుతం సాధారణ జ్వరం, జలుబు, తలనొప్పి, ఒళ్లు నొప్పులకు గోలీలు ఇవ్వడం మినహా ప్రత్యేక వైద్య సేవలు అందడం లేదు. శస్త్రచికిత్స అవసరమైన రోగులను ఎంజీఎం ఆస్పత్రికి పంపిస్తున్నారు. ఈఎస్ఐ కార్డు ఉన్నా.. వైద్యం కోసం వచ్చిన రోగులకు ఎంజీఎంకు వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో ఈఎస్ఐ ఆస్పత్రి ఎందుకు? కార్మికుల నుంచి వసూలు చేస్తున్న బీమా సొమ్ము దేనికి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

- అక్షర శక్తి, నిఘా ప్రతినిధి




# హన్మకొండకు మహా అభివృద్ధి ప్రణాళిక

- హన్మకొండ చౌరస్తా రీడెవలప్‌మెంట్‌కు కార్యాచరణ
- అండర్ డ్రైనేజీ, వాటర్ వర్క్స్‌కు అధిక ప్రాధాన్యం
- భద్రకాళి, వరంగల్ కోట, దేవునూరు గుట్టలపై ప్రత్యేక దృష్టి
- హన్మకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్మన్ చాహత్ బాజ్‌పేయి

## పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం

## అశోక హోటల్ ఎదురుగా మల్టీలెవల్ పార్కింగ్

హన్మకొండ నగరంలో పెరుగుతున్న పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు మల్టీలెవల్ పార్కింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నామని హన్మకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్మన్ ఐఏఎస్ చాహత్ బాజ్‌పేయి వెల్లడించారు. హన్మకొండ అశోక హోటల్‌కు ఎదురుగా ఉన్న కుడా స్థలంలో మల్టీలెవల్ కార్ పార్కింగ్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయని, ముందు భాగాన్ని వాణిజ్య అవసరాలకు వినియోగించేలా రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. అదే తరహాలో హన్మకొండ చౌరస్తాలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రాంతాన్ని కూడా అభివృద్ధి చేసే ఆలోచన ఉందన్నారు. నగర అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. మంగళవారం హన్మకొండ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో జిల్లా, నగర అభివృద్ధి పనులపై ఆమె వివరాలు వెల్లడించారు.

- అక్షరశక్తి, హన్మకొండ





SPECIAL PAGE



## బీఫార్మసీ కౌన్సెలింగ్ ప్రారంభం

**అక్షరశక్తి, హనుమకొండ:** రాష్ట్రవ్యాప్తంగా 2026-27 విద్యా సంవత్సరానికి బీఫార్మసీ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం ఆర్ట్స్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభమైంది. ఈ నెల 17వ తేదీ వరకు జరిగే కౌన్సెలింగ్‌లో జీవ శాస్త్ర విద్యార్థులకు ఎప్‌సెట్ ద్వారా బీఫార్మసీ, జీవవైద్య ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి అవసరమైన ధ్రువపత్రాలను పరిశీలన ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంద. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి విద్యార్థులకు ధ్రువపత్రాల పరిశీలన రసీదులను అందజేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ, అర్హత కలిగిన విద్యార్థులు నిర్ణీత గడువులోగా ధ్రువపత్రాల పరిశీలనను పూర్తి చేసుకుని ప్రవేశ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రెహ్మాన్, డాక్టర్ అంజన్‌రావు, డాక్టర్ ఆశీర్వాదం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ఇంజినీర్లు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలి

**యూనివర్సిటీ ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ఘనంగా ఇంజినీర్స్ డే**



**అక్షరశక్తి, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ (యూసీఈటీడబ్ల్యూ)లో భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఇంజినీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ సర్కిల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ డి. రాజిన్‌కుమార్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు క్రమశిక్షణ, సాంకేతిక నైపుణ్యం, కష్టపడి పనిచేసే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. యూపీఎస్సీ, టీజీపీఎస్సీ, టీజీ జెన్‌కో, టీజీ ఎన్‌పీడీసీఎల్ వంటి ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగావకాశాలను లక్ష్యంగా చేసుకుని ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని సూచించారు. విశ్వేశ్వరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని దేశ అభివృద్ధిలో ఇంజినీర్లు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. బిక్షాలు మాట్లాడుతూ విద్యతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అభ్యసించి సమాజానికి ఉపయోగపడేలా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించేందుకు కళాశాల సహకరిస్తుందని తెలిపారు. అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ టి. అర్చన విద్యా ప్రగతితో పాటు నైపుణ్యాభివృద్ధి, కమ్యూనికేషన్ స్కిల్స్, ఉద్యోగ పోటీ పరీక్షలకు సన్నద్ధతపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈఈఈ విభాగం ఇన్‌చార్జి వెంకటేష్ తూర్పాటి ఇంజినీరింగ్ రంగంలో మహిళల పాత్ర పెరుగుతోందని, విద్యార్థినులు సాంకేతిక విద్యను సద్వినియోగం చేసుకుని మహిళా సాధికారతకు ప్రతినిధులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బోధనా సిబ్బంది సాహితి, యశస్విని, వాణిశ్రీ, కిరణ్, దీప్తి, స్వప్న, వైష్ణవి, రచన, శ్రీజ, కిషన్, శ్రీనివాస్, శ్రీ విద్య, రూసా ఫెలోస్ రమాజ్యోతి, సౌజన్య, అఖిల, నాన్‌టీచింగ్ సిబ్బంది సూపరింటెండెంట్ వీరునాయక్, చాగంటి శ్రీనివాస్, తాజ్‌బాబా తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## వైన్స్ ఎదుట దంపతుల ఆత్మహత్యాయత్నం

**రూ.40 వేల మద్యం స్వాధీనం చేసుకున్నారని ఆందోళన**

**అక్షరశక్తి, మహబూబాబాద్:** నర్సింహులపేటలోని మధుర వైన్స్ ఎదుట నిర్వాహకులు యాకయ్య, స్వాతి దంపతులు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. తమ బెల్టాషాపుపై అబ్కారీ అధికారులు దాడి చేసి రూ.40 వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారని ఆరోపిస్తూ వారు ఆందోళనకు దిగారు. వైన్స్‌షాప్ అనుమతితోనే మద్యం కొనుగోలు చేసి విక్రయిస్తున్నామని దంపతులు తెలిపారు. అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.

# అమ్మకానికి సంక్షేమ బియ్యం

- అడ్డంగా దొరికిన వార్డెన్
- వార్డెన్‌తోపాటు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు
- కలెక్టర్‌కు ఎఫ్ ఐ ఆర్ కాపీ
- శాఖపరమైన చర్యలకు సిద్ధం..

**అక్షరశక్తి, హన్మకొండ క్రైమ్ :** హన్మకొండ బాలసముద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహానికి సంబంధించిన బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఘటనలో హాస్టల్ వార్డెన్, ఆటో డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. గత నెల చివరి ఆదివారం రోజున ఆటోలో బియ్యాన్ని తరలిస్తుండగా పెట్రోలింగ్ పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. సెలవు దినం రోజు హాస్టల్ వద్ద నుంచి బియ్యం తరలించడంపై అనుమానించిన పోలీసులు విచారణ చేపట్టి వివరాలు సేకరించారు. వసతి గృహానికి కేటాయించిన బియ్యం బయటకు ఎందుకు తరలిస్తున్నారు.. అధికారిక అనుమతి ఉందా అనే వివరాలు తీసుకున్నారు. బియ్యం స్వాధీనం చేసుకుని సివిల్ సప్లయ్ అధికారులకు పోలీసులు సమాచారం అందించి బియ్యాన్ని వారికి అందజేశారు. ఆ మరుసటి రోజు మీడియాలో వచ్చిన వార్తల ఆధారంగా జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి నిర్మల వసతి గృహాన్ని తనిఖీ చేసి వివరాలు సేకరించారు. వసతి గృహంలోని బియ్యం నిల్వలు, రికార్డులు, విద్యార్థుల సంఖ్య, సరఫరా వివరాలను పరిశీలించారు. విచారణ అనంతరం కలెక్టర్‌కు నివేదిక సమర్పించినట్లు సమాచారం. ఘటన జరిగి 16 రోజులవుతున్నా బియ్యాన్ని తరలించిన వారిపై ఎలాంటి చర్యలు లేకపోవడంతో అక్షరశక్తి విలేకరి సుబేదారి సీఐ, హాస్టల్ ఉన్నతాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకోగా హాస్టల్ వార్డెన్‌తో పాటు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదైనట్లు తెలిసింది. సీఐ రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఆ కాపీని కలెక్టర్‌కు అందించినట్లు తెలిపారు. దీనిపై ఎస్సీ జిల్లా సంక్షేమ అధికారి నిర్మలను వివరణ కోరగా విచారణ అనంతరం అన్ని విషయాలు కలెక్టర్‌కు నివేదించామని, కలెక్టర్ ఉత్తర్వుల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.

**రికార్డులు.. నిల్వలు సరిపోలుతాయా ?**

వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థినుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులు పక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అన్ని వసతి గృహాలకు ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం విషయంలో స్టాక్ రిజిస్టర్‌లో ఉన్న పరిమాణం, వాస్తవంగా గోదాముల్లో ఉన్న బియ్యం, విద్యార్థుల సంఖ్య, వినియోగం వంటి అంశాలను అధికారులు పరిశీలించాల్సి ఉంది. గత కొన్ని నెలల రికార్డులను పరిశీలిస్తే బియ్యం తరలింపులో జరిగిన అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

# ముమ్మాటికీ తెలంగాణ విమోచన దినోత్సవమే

**అక్షరశక్తి, వరంగల్:** సెప్టెంబర్ 17 ముమ్మాటికీ తెలంగాణ విమోచన దినోత్సవమే బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావు వరంగల్, సెప్టెంబర్ 15: సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో మరుపురాని చారిత్రక ఘట్టమని, నిజాం నిరంకుశ పాలన నుంచి హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనమైన రోజును తెలంగాణ విమోచన దినోత్సవంగా గౌరవించడం ప్రతి తెలంగాణ బిడ్డ బాధ్యత అని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సూచనల మేరకు గంట రవికుమార్ అధ్యక్షతన వరంగల్ చౌరస్తాలోని కె. కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సమావేశంలో రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 17ను "విలీన దినం", "ప్రజా పాలన దినం" వంటి పేర్లతో పిలిచినంత మాత్రాన చారిత్రక వాస్తవాలు మారవని పేర్కొన్నారు.



హైదరాబాద్ విమోచన ఉద్యమం, తెలంగాణ సాయుధ పోరాటం రెండూ వేర్వేరు చారిత్రక పరిణామాలని, వాటి లక్ష్యాలు, రాజకీయ నేపథ్యం, కాలపరిమితి భిన్నంగా ఉన్నాయని బీజేపీ నేతలు స్పష్టం చేశారు. నిజాం పాలన నుంచి హైదరాబాద్ రాష్ట్రాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయాలనే జాతీయవాదుల పోరాటాన్ని, 1946-51 మధ్య సాగిన తెలంగాణ సాయుధ పోరాటంతో పూర్తిగా కలిపేయడం చరిత్రను వక్రీకరించడమేనని అన్నారు. పరకాల, భైరాన్‌పల్లి వంటి ఘటనలు, నిజాం-రజాకార్ల దమనకాండకు వ్యతిరేకంగా పోరాడిన జాతీయవాదులు, స్వాతంత్ర్య సమరయోధులు, సామాన్య ప్రజల త్యాగాలను పాఠ్యాంశాల్లో సమగ్రంగా చేర్చాలని డిమాండ్ చేశారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం సెప్టెంబర్ 17 చారిత్రక ప్రాధాన్యతను నీరుగార్చే ప్రయత్నాలను సహించబోమన్నారు.

సెప్టెంబర్ 17ను అధికారికంగా "తెలంగాణ విమోచన దినోత్సవం"గా నిర్వహించాలని, హైదరాబాద్ విమోచన ఉద్యమం, తెలంగాణ సాయుధ పోరాటాల చరిత్రను వేర్వేరుగా వాస్తవ ఆధారాలతో బోధించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. చరిత్రను ఏ ఒక్క రాజకీయ సిద్ధాంతానికి అనుగుణంగా మార్చకుండా వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, జలగం రంజిత్ రావు, కుసుమ సతీష్, సిద్ధం నరేష్‌తో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, కందిమల్ల మహేష్, మీడియా కన్వీనర్ అంకాల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

- తెలంగాణ చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి
- గుజ్జల ప్రేమేందర్‌రెడ్డి

**అక్షరశక్తి, పరకాల :** సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు గుజ్జల ప్రేమేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పరకాల పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానానికి 1948 సెప్టెంబర్ 17న సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ చేపట్టిన పోలీసు చర్య అనంతరం విమోచనం లభించిందని తెలిపారు. అందువల్ల సెప్టెంబర్ 17ను అధికారికంగా విమోచన దినోత్సవంగా నిర్వహించాలని కోరారు. ఓటుబ్యాంకు రాజకీయాల కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎంఐఎంతో రాజీపడుతున్నాయని ఆరోపించారు. తెలంగాణ చరిత్ర, ఉద్యమాల నేపథ్యాన్ని విద్యార్థులకు పాఠ్యాంశాలుగా బోధించాలని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములై రాష్ట్రాన్ని సాధించుకున్నారని, అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం కుటుంబ పాలనకు పరిమితమైందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై



చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ అవగాహన ఉందని ఆరోపించారు. బ్రిక్స్ సదస్సును ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో నిర్వహించడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు.

బీజేపీ రాష్ట్ర నాయకుడు, పరకాల అసెంబ్లీ నియోజకవర్గ కాంటెస్టెడ్ అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీప్రసాద్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత ప్రజలపై రజాకారులు సాగించిన దాడులు, అకృత్యాలను చరిత్రలో మరువరాదన్నారు. ఆపరేషన్ పోలో ద్వారా హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సబ్బండ వర్గాలు భాగస్వాములయ్యాయని గుర్తుచేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తామని గతంలో ప్రకటించిన కేసీఆర్ అధికారంలోకి వచ్చిన అనంతరం హామీని విస్మరించారని విమర్శించారు.

పరకాల అభివృద్ధిపై మాట్లాడుతూ వైద్య కళాశాల ఏర్పాటు విషయంలో రాజకీయాలు చేయకుండా ఎవరు తీసుకొచ్చినా స్వాగతిస్తామని అన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పరకాలకు వైద్య కళాశాల ఎందుకు గుర్తుకు రాలేదని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో పరకాలలో బీజేపీ బలపడితే అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ కౌన్సిలర్లు కుక్కల విజయకుమార్, బెజ్జంకి పూర్ణచారి, ఆకుల లావణ్య శ్రీధర్, జిల్లా కోశాధికారి ఎర్రం రామన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి పాలకుర్తి తిరుపతి, దంచనాధుల కిరణ్, మాజీ మున్సిపల్ చైర్మన్ మార్త రాజభద్రయ్య, ఓబీసీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి ఉడుత చిరంజీవి, జిల్లా నాయకులు బాసాని సోమరాజు, బీసీ మోర్చా మండల అధ్యక్షులు పైండ్ల రంజిత్, నాయకులు కోడెల లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ





**అక్షరశక్తి, హసన్‌పర్తి:** నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ (ఎన్ఎంఎన్ఎఫ్) పథకం కింద మడిపల్లి రైతు వేదికలో జయగిరి, లక్నవరం, మడిపల్లి రెవెన్యూ గ్రామాలకు చెందిన 125 మంది రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి అడ్లూరి అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యత, అవసరం, ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి, స్థానికంగా లభించే సహజ వనరులను ఉపయోగించుకోవడం ద్వారా తక్కువ ఖర్చుతో స్థిరమైన వ్యవసాయం చేపట్టవచ్చని తెలిపారు. ఏడీఏ ఆదిరెడ్డి రైతులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రైతులు తమ పొలంలో లభించే పశువుల ఎరువు, పంట అవశేషాలు, వేప వంటి స్థానిక వనరులను సద్వినియోగం చేసుకొని సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నేలలో జీవపదార్థం, సూక్ష్మజీవుల కార్యకలాపాలు మెరుగుపడి, నేల ఆరోగ్యం కాపాడబడుతుందని వివరించారు. "తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన నేల, నాణ్యమైన పంట, రైతుకు మెరుగైన ఆదాయం" అనే విధంగా ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు దశలవారీగా అలవర్చుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో 15 సంవత్సరాల అనుభవం కలిగిన రిసోర్స్ పర్సన్ హుస్సేన్ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, సేంద్రీయ ఎరువులు, సహజ పురుగుమందుల తయారీ, వినియోగ విధానాలపై శిక్షణ అందించారు. ఆయన స్వయంగా తయారు చేసిన నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, పంచగవ్య, వావిలాకు కషాయం, అగ్నాస్త్రం, వేస్ట్ డీకంపోజర్, దశపర్ణి కషాయం తదితరాల తయారీ విధానం, వినియోగం మరియు ప్రయోజనాలను ప్రదర్శించి వివరించారు. అనంతరం ఎన్ఎంఎన్ఎఫ్ పథకం కింద ఎంపికైన 125 మంది రైతులకు కిట్లను జిల్లా వ్యవసాయ అధికారి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, ఏడీఏ ఆదిరెడ్డి, ఎంఏవో అడ్లూరి అనురాధ, ఏఈవో సుమన్, మడిపల్లి గ్రామ సర్పంచ్ రంజిత్, జయగిరి సీఆర్పీ రమ్య, మడిపల్లి సీఆర్పీ రవళితో పాటు జయగిరి, లక్నవరం, మడిపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# టూరిస్ట్ గైడ్ విలువలతో కూడిన విధానాన్ని అనుసరించాలి

**ప్రొఫెసర్ జయప్రకాష్ నారాయణ**








**అక్షరశక్తి,హనుమకొండ:** టూరిస్ట్ గైడ్ వృత్తిలో నైపుణ్యాలతో పాటు విలువలు, నైతికత, బాధ్యతాయుతమైన విధానాన్ని అనుసరించాలని ఇందిరాగాంధీ నేషనల్ ట్రైబల్ సెంట్రల్ యూనివర్సిటీ, అమర్‌కంటక్ (మధ్య ప్రదేశ్) టూరిజం మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ జయప్రకాష్ నారాయణ అన్నారు. పింగిలి ప్రభుత్వ మహిళా కళాశాలలో చరిత్ర విభాగాధిపతి డాక్టర్ కొలిపాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టూరిజం సర్టిఫికెట్ కోర్సులో భాగంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని 'టూరిస్ట్ గైడింగ్ ప్రొఫెషన్: రోల్స్, ఎథిక్స్, ప్రొఫెషనల్ స్కిల్స్ అండ్ ఎఫెక్టివ్ టూర్ మేనేజ్‌మెంట్' అనే అంశంపై సుదీర్ఘంగా ప్రసంగించారు. టూరిస్ట్ గైడ్‌కు భాషా నైపుణ్యాలతో పాటు చారిత్రక, సాంస్కృతిక, భౌగోళిక అంశాలపై సమగ్ర అవగాహన ఉండాలని తెలిపారు. పర్యాటకులకు ఒక ప్రాంతం ప్రత్యేకతలను ఆసక్తికరంగా వివరించగలగాలని, అందుకే టూరిస్ట్ గైడ్‌ను మంచి 'స్టోరీ టెల్లర్'గా కూడా పరిగణిస్తారని చెప్పారు. టూరిస్ట్ గైడ్ బాధ్యతలను దేవుడితో పోలుస్తూ, పర్యాటకులకు సరైన సమాచారం అందించడం, వారి భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకోవడం వంటి అంశాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. టూరిస్ట్ గైడ్ల కోసం సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించడం ద్వారా భాషా నైపుణ్యాలు, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. హిస్టారికల్ టూరిజం, అడ్వెంచర్ టూరిజం, రివర్ టూరిజం, హైకింగ్ టూరిజం తదితర పర్యాటక రకాలపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ టూరిస్ట్ గైడ్ అసోసియేషన్, ఫెడరేషన్ ఆఫ్ యూరోపియన్ టూరిస్ట్ గైడ్ అసోసియేషన్, టూరిస్ట్ గైడ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలలో సభ్యులుగా చేరి పర్యాటక ప్రాంతాల వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేయడానికి గైడ్లు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సుహాసిని అధ్యక్షత వహించి మాట్లాడుతూ, టూరిజం సర్టిఫికెట్ కోర్సు విద్యార్థులకు భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థులు అదనపు నైపుణ్యాలను సంపాదించుకొని భవిష్యత్తులో ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ డి. సురేష్‌బాబు, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ అరుణ, చరిత్ర విభాగాధిపతి డాక్టర్ కొలిపాక శ్రీనివాస్, అధ్యాపకులు డాక్టర్ పి. నరేష్, డాక్టర్ బి. జ్యోతి, కెమిస్ట్రీ అధ్యాపకులు బాలరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు

- **మహేష్ కుమార్ గౌడ్‌కు ఎర్రబెల్లి స్వర్ణ శుభాకాంక్షలు**



**అక్షరశక్తి,హైదరాబాద్:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడిగా రెండేళ్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం గాంధీభవన్‌లో మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమైందని, కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నింపారని ఎర్రబెల్లి స్వర్ణ కొనియాడారు. సామాన్య కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎదిగిన మహేష్ కుమార్ గౌడ్ ప్రస్థానం స్ఫూర్తిదాయకమని ఆమె అన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై పోరాటం చేయడంలో ఆయన చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. మహిళా కాంగ్రెస్ తరఫున ఆయనకు ఎల్లప్పుడూ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరిన్ని విజయాలు సాధించాలని, మహేష్ కుమార్ గౌడ్ ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా: చల్లా ధర్మారెడ్డి



**అక్షరశక్తి, పరకాల:** మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మంగళవారం దామెర మండలంలోని పులుకుర్తి, ఊరుగొండ, దుర్గంపేట, తక్కళ్లపాడు గ్రామాల్లో పర్యటించారు. ఇటీవల మృతిచెందిన మాదారపు రామచంద్రం, గోవిందు సరోజన, పాముల నీల, అందే సదానందం, మోతె ఎల్లస్వామి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అలాగే తక్కళ్లపాడు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ మార్త కోటి తల్లి జగతమ్మ మృతిచెందడంతో ఆమె కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. అనంతరం కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న యూత్ నాయకుడు మోరే చిరంజీవిని చల్లా ధర్మారెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఆత్మకూరు మండలంలోని నాగయ్యపల్లి, పెద్దాపూర్ గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన మాజీ వార్డు సభ్యులు అప్పని రాజీరు, బింగి రాజయ్య, చాపర్తి సమ్మయ్య కుటుంబాలను పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని అన్నారు. కార్యకర్తల కష్టసుఖాల్లో భాగస్వాములుగా ఉంటూ వారికి ధైర్యం కల్పిస్తామని తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డికి ఘన సన్మానం



**అక్షరశక్తి,కేయూ క్యాంపస్:** కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డిని ఉస్మానియా యూనివర్సిటీ మాజీ జాయింట్ రిజిస్ట్రార్ ఉప్పరి ఎల్లేష్ ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీలో రిజిస్ట్రార్‌గా పనిచేసిన సమయంలో ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డితో కలిసి పనిచేసిన అనుభవాలు మరువలేనివని ఎల్లేష్ అన్నారు. పరిపాలనా రంగంలో సమర్థవంతంగా పనిచేస్తూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేసిన వ్యక్తిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు, సిబ్బందితో ఆత్మీయంగా మెలుగుతూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే వ్యక్తిత్వం ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డిదని ఉప్పరి ఎల్లేష్ కొనియాడారు. కాకతీయ యూనివర్సిటీ విద్యా, పరిశోధన, పరిపాలనా రంగాల్లో అభివృద్ధి సాధించేలా ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆయన నాయకత్వంలో యూనివర్సిటీ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, ఉద్యోగులు, సిబ్బంది, విద్యావేత్తలు పాల్గొని ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

# బాలాజీ విద్యాసంస్థల్లో ఘనంగా టీచర్స్ డే



**అక్షరశక్తి, నర్సంపేట:** నర్సంపేట పట్టణంలోని బాలాజీ విద్యాసంస్థలకు చెందిన బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ పాఠశాలలో సెప్టెంబర్ 5న టీచర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బాలాజీ విద్యాసంస్థల ట్రెజరర్ డాక్టర్ ఏ. వనజారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వనజారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురువుల గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం ఉపాధ్యాయులందరికీ పేరుపేరునా టీచర్స్ డే శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## కేయూ దూరవిద్య ప్రవేశాల గడువు పొడిగింపు

**అక్షరశక్తి,కేయూ క్యాంపస్ :** యూజీసీ-డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో ఆదేశాల మేరకు 2026-27 విద్యా సంవత్సరానికి ఆగస్టు 2026 విద్యా సెషన్‌లో ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ (ఓడీఎల్), ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాల గడువును పొడిగించినట్లు కాకతీయ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య బి. సురేష్‌లాల్ తెలిపారు. సెప్టెంబర్ 15తో ముగియాల్సిన ప్రవేశాల గడువును అక్టోబర్ 13 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. కేయూ దూరవిద్య ద్వారా సర్టిఫికెట్, డిప్లొమా, డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొంద దలచిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం కాకతీయ విశ్వవిద్యాలయం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

## కేయూ దూరవిద్య ప్రవేశాల గడువు పొడిగింపు

**అక్షరశక్తి,కేయూ క్యాంపస్ :** యూజీసీ-డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో ఆదేశాల మేరకు 2026-27 విద్యా సంవత్సరానికి ఆగస్టు 2026 విద్యా సెషన్‌లో ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ (ఓడీఎల్), ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాల గడువును పొడిగించినట్లు కాకతీయ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య బి. సురేష్‌లాల్ తెలిపారు. సెప్టెంబర్ 15తో ముగియాల్సిన ప్రవేశాల గడువును అక్టోబర్ 13 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. కేయూ దూరవిద్య ద్వారా సర్టిఫికెట్, డిప్లొమా, డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొంద దలచిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం కాకతీయ విశ్వవిద్యాలయం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

## కేయూ స్నాతకోత్సవానికి పీహెచ్‌డీ పట్టాల నమోదు

### నవంబర్ 15లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు

**అక్షరశక్తి, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయం 24వ స్నాతకోత్సవాన్ని నవంబర్ 28న నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ కట్ల తెలిపారు. 2025 జూలై 1 నుంచి 2026 అక్టోబర్ 31 వరకు పీహెచ్‌డీ పట్టా పొందిన వారు స్నాతకోత్సవంలో స్వయంగా పట్టా స్వీకరించదలచుకుంటే నవంబర్ 15లోపు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు www.kuonline.co.in(http://www.kuonline.co.in) ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

## రైతులకు ఉచిత ఎరువుల బుకింగ్

### ఆధార్, మొబైల్‌తో అరుణ ఫర్టిలైజర్స్‌లో సౌకర్యం



**అక్షరశక్తి, పరకాల:** రైతులకు ఎరువుల బుకింగ్ ప్రక్రియను సులభతరం చేసేందుకు పరకాలలోని అరుణ ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ ఆధ్వర్యంలో ఉచితంగా బుకింగ్ సేవలు అందిస్తున్నట్లు సంస్థ ప్రొప్రైటర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రస్తుతం ఎరువుల పంపిణీ ఫెర్టిలైజర్స్ సేల్ అప్లికేషన్ సిస్టమ్ సెంట్రల్ యాప్ ద్వారా జరుగుతోందని పేర్కొన్నారు. ఈ విధానంపై అవగాహన లేని రైతులకు తమ షాప్‌లో ఎలాంటి రుసుము లేకుండా బుకింగ్ చేసి సహకరిస్తామని తెలిపారు. రైతులు ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్, సర్వే నంబర్లు, మొబైల్ ఫోన్ వివరాలతో షాప్‌ను సంప్రదిస్తే బుకింగ్ ప్రక్రియలో సహాయం అందిస్తామని చెప్పారు. ఆధార్, ఫార్మర్ ఐడీ, అగ్రిస్టాక్ ఐడీ ద్వారా నమోదు చేసుకుని భూమి, పంట వివరాలను నమోదు చేసి ముందస్తుగా ఎరువులు బుక్ చేసుకోవచ్చన్నారు. బుకింగ్ అనంతరం లభించే క్యూఆర్ కోడ్ టోకెన్‌ను షాప్‌లోని పీఓఎస్ మెషిన్ ద్వారా స్కాన్ చేసి ఎరువులు పొందవచ్చని వివరించారు. అరుణ ఫర్టిలైజర్స్‌లో వివిధ రకాల ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. యూరియా, పొటాషియం, డీఏపీ, సూపర్ 20:20 తదితర ఎరువులను ప్రభుత్వ నిబంధనల మేరకు బుకింగ్ చేసుకునేందుకు రైతులకు సహకరిస్తామని పేర్కొన్నారు. మరింత సమాచారం, బుకింగ్ సహాయం కోసం 9848293039, 9951666731 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# సెప్టెంబర్ 17 ముమ్మాటికీ విమోచన దినోత్సవమే

- చరిత్రను వక్రీకరించొద్దు: రాణి రుద్రమ రెడ్డి
- జాతీయవాదుల త్యాగాలను మరుగునపెట్టే కుట్రలను సహించం
- : గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి



**అక్షరశక్తి, నర్సంపేట:** సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ డిమాండ్ చేశారు. మంగళవారం నర్సంపేట నియోజకవర్గ బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.

సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో మరుపురాని ఘట్టమని, నిజాం నిరంకుశ పాలన నుంచి హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లోకి వచ్చిన రోజును తెలంగాణ విమోచన దినోత్సవంగా గౌరవించడం ప్రతి తెలంగాణ బిడ్డ బాధ్యత అని అన్నారు. సెప్టెంబర్ 17ను విలీన దినం, ప్రజాపాలన దినం అంటూ పేర్లు మార్చినంత మాత్రాన చరిత్ర మారదన్నారు. ఓటుబ్యాంకు రాజకీయాల కోసం చారిత్రక దినోత్సవ స్ఫూర్తిని కాంగ్రెస్ ప్రభుత్వం మరుగునపరుస్తోందని విమర్శించారు.

బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ విమోచన ఉద్యమం, తెలంగాణ సాయుధ పోరాటం రెండూ ఒకటి కాదన్నారు. వాటి లక్ష్యాలు, రాజకీయ నేపథ్యం, కాలపరిమితి, అంతిమ లక్ష్యాలు వేర్వేరని పేర్కొన్నారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లోకి వచ్చిన వాస్తవాన్ని ఎవరూ చెరిపివేయలేరన్నారు. రెండు ఉద్యమాల చరిత్రను వేర్వేరుగా, వాస్తవ ఆధారాలతో పాఠ్యాంశాల్లో చేర్చాలని కోరారు. పరకాల, భైరాన్‌పల్లి వంటి చారిత్రక ఘటనలు, నిజాం నిరంకుశత్వం, రజాకార్ల దమనకాండను నేటి తరానికి తెలియజేయాలని అన్నారు.

కార్యక్రమంలో మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్, 28వ వార్డు కౌన్సిలర్ జూలూరి రోజారాణి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వద్దేపల్లి నరసింహరాములు, జిల్లా ఉపాధ్యక్షులు రేసు శ్రీనివాస్, పార్లమెంట్ కోకన్వీనర్ కట్ల రాంచేందర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా నాయకులు గద్దం ఆంజనేయులు, మాజీ మండల అధ్యక్షులు అబోతు రాజు యాదవ్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు సంగేమ్ శంకర్, నియోజకవర్గ నాయకులు జూలూరి మనీష్‌గౌడ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్, రూరల్ అధ్యక్షులు అంబేత్కర్ నల్లబెల్లి అధ్యక్షులు తడక వినయ్‌గౌడ్, చెన్నరావుపేట అధ్యక్షులు శేఖర్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు కొంకిసా విగ్నేష్‌గౌడ్, ఎర్ర రాజు, బీజేపీ పట్టణ నాయకులు విజయ్‌సింగ్, కాసుల నాగేంద్రబాబు, అల్లం నిఖిల్, ముత్యాల శ్రీనివాస్, సామల ప్రవీణ్‌కుమార్, నూనె రంజిత్, అజీమ్, అనిల్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హనుమకొండలో విషాదం..

- చెట్టుకు ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య
- డివైడర్ మధ్యలోని చెట్టుకు వేలాడుతున్న మృతదేహం
- జేబులో బస్ టికెట్, సెల్‌ఫోన్ గుర్తింపు..
- మృతుడు ఇతర రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా అనుమానం

**అక్షరశక్తి, హన్మకొండ క్రైం :** హనుమకొండ జిల్లా సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. హన్మకొండ హైదరాబాద్ ప్రధాన రహదారిలో నాయుడు కుండా బిర్యానీ హోటల్ ఎదురుగా ఉన్న రహదారిపై డివైడర్ మధ్యలోని చెట్టుకు ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. రహదారి మధ్యలోని డివైడర్ వద్ద చెట్టుకు వ్యక్తి ఉరివేసుకుని ఉన్న విషయాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సుబేదారి పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని కిందకు దించి ప్రాథమిక వివరాలను సేకరించారు.



**జేబులో బస్ టికెట్.. సెల్‌ఫోన్**

మృతుడి వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించగా జేబులో బస్ టికెట్‌తో పాటు సెల్‌ఫోన్ లభించినట్లు సమాచారం. మృతుడు వేరే రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. సెల్‌ఫోన్ ఆధారంగా అతడి కుటుంబ సభ్యులు, బంధువుల వివరాలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. మృతుడి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. అతడు ఎక్కడి నుంచి హనుమకొండకు వచ్చాడు? ఇక్కడికి వచ్చిన కారణం ఏమిటి? ఎవరినైనా కలవడానికి వచ్చాడా? అనే కోణాల్లో పోలీసులు ఆరా తీస్తున్నారు. బస్ టికెట్, సెల్‌ఫోన్‌లోని సమాచారాన్ని దర్యాప్తులో భాగంగా పరిశీలిస్తున్నారు.వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడటానికి గల కారణాలు ప్రస్తుతం తెలియరాలేదు. వ్యక్తిగత సమస్యలా, ఆర్థిక ఇబ్బందులా, కుటుంబ కారణాలా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి గుర్తింపు పూర్తిగా నిర్ధారించిన అనంతరం మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**పోలీసుల దర్యాప్తు**

ఈ ఘటనపై సుబేదారి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు పోలీసులు చర్యలు చేపడుతున్నారు. దర్యాప్తు పూర్తయితే ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# విద్యార్థినుల భద్రతే షీ టీం లక్ష్యం


**అక్షరశక్తి, భూపాలపల్లి:** జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని కేజీబీవీ, కళాశాలలో షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు మహిళలు, బాలికల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం సిబ్బంది మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా తెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవద్దని సూచించారు. వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, వీడియోలను అపరిచితులతో పంచుకోవద్దని, అపరిచితుల ఫోన్ కాల్స్‌కు స్పందించి వ్యక్తిగత సమాచారం వెల్లడించవద్దని తెలిపారు. వేధింపులు ఎదురైతే భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.



మహిళలు, బాలికలు ఎదుర్కొనే వేధింపుల్లో పరిచయస్తుల ప్రమేయం కూడా ఉంటుందని, అలాంటి సందర్భాల్లో నిర్భయంగా షీ టీంను సంప్రదించాలని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రయాణ సమయంలో టిసేఫ్ యాప్‌ను వినియోగించాలని, అనుమానాస్పద లింకులు, క్యూఆర్ కోడ్‌లు, ఏపీకే ఫైళ్లను క్లిక్ చేయకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలికలకు ఇబ్బంది ఎదురైతే షీ టీం 8712658162, అత్యవసర పరిస్థితుల్లో 112, సైబర్ నేరాలకు 1930 నంబర్లకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్, పోక్సో చట్టం, మహిళలు, బాలల రక్షణ చట్టాలపై నిజజీవిత ఘటనలను ఉదాహరణలుగా వివరిస్తూ అవగాహన కల్పించారు.

# డ్యూటీలకు డుమ్మా!

- ఈఎస్ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎక్కడ..?
- ఆస్పత్రిలో వైద్య సేవలు మృగ్యం
- నెలకోసారి చుట్టుపుచూపుగా ఉన్నతాధికారి రాక
- ఆస్పత్రి బాధ్యతలు ఓ వైద్యుడికి అప్పగించి ఆన్‌లైన్‌లో పర్యవేక్షణ
- వైద్యులు విధులకు రాకున్నా వంద శాతం హాజరు
- మొత్తం 10 మంది డాక్టర్లు.. విధుల్లో ఉండేది ఇద్దరే
- నర్సులు, అటెండర్లతోనే ఆస్పత్రి నిర్వహణ..
- మధ్యాహ్నం తర్వాత వారు కూడా గాయబ్
- శస్త్రచికిత్సలన్నీ ఎంజీఎంకు రెఫర్..
- ప్రశ్నార్థకంగా కార్మికుల ఆరోగ్య భద్రత









ఖాళీగా సూపరిండెంట్ ఆఫీసు

**అక్షర శక్తి, నిఘా ప్రతినిధి :** కార్మిక రాజ్య బీమా సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరంగల్ ఈఎస్ఐ ప్రాంతీయ వైద్యశాల నిర్వహణ గాడితప్పింది. ఆస్పత్రిని పర్యవేక్షించాల్సిన ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కాంతి సాగర్ ఆస్పత్రికి క్రమం తప్పకుండా హాజరు కాకపోవడంతో పరిపాలన పూర్తిగా అస్తవ్యస్తమైంది. వరంగల్ గొర్రెకుంట ఈఎస్ఐ ఆస్పత్రికి నెలకోసారి వచ్చి చుట్టుపుచూపుగా వెళ్లిపోతున్న సూపరింటెండెంట్ కాంతి సాగర్ ఆస్పత్రి బాధ్యతలను ఓ వైద్యుడికి అప్పగించి ఆన్‌లైన్‌లోనే పర్యవేక్షిస్తున్నారు. దీంతో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఉద్యోగులపై నియంత్రణ లేకుండా పోయింది. విధులకు రాని వైద్యులు, సిబ్బందికి సైతం హాజరు రికార్డుల్లో వంద శాతం హాజరు నమోదవుతోంది. నెలనెలా ఉన్నతాధికారులకు మామూళ్లతో వ్యవహారం మేనేజ్ అవుతుండటంతో ఆస్పత్రి నిర్వహణపై ఎలాంటి పర్యవేక్షణ లేకుండా పోయింది. కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యం అందించాల్సిన ఆస్పత్రిలో ప్రస్తుతం సాధారణ జ్వరం, జలుబు, తలనొప్పి, ఒళ్లు నొప్పులకు గోలీలు ఇవ్వడం మినహా ప్రత్యేక వైద్య సేవలు అందడం లేదు. శస్త్రచికిత్స అవసరమైన రోగులను ఎంజీఎం ఆస్పత్రికి పంపిస్తున్నారు. ఈఎస్ఐ కార్డు ఉన్నా.. వైద్యం కోసం వచ్చిన రోగులకు ఎంజీఎంకు వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో ఈఎస్ఐ ఆస్పత్రి ఎందుకు? కార్మికుల నుంచి వసూలు చేస్తున్న బీమా సొమ్ము దేనికి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**సూపరింటెండెంట్ పర్యవేక్షణ గాలికి..**

ఆస్పత్రి నిర్వహణలో సూపరింటెండెంట్ పాత్ర అత్యంత కీలకం. వైద్యులు సమయానికి విధులకు వస్తున్నారా? రోగులకు వైద్య సేవలు అందుతున్నాయా? మందులు అందుబాటులో ఉన్నాయా? నర్సింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారా? ఆస్పత్రిలో పారిశుద్ధ్యం, అత్యవసర సేవలు ఎలా ఉన్నాయి? అనే అంశాలను ప్రతిరోజూ పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ గొర్రెకుంట ఈఎస్ఐ ఆస్పత్రిలో ఈ వ్యవస్థ పూర్తిగా కుప్పకూలింది. ఇన్‌చార్జి సూపరింటెండెంట్ నెలకోసారి ఆస్పత్రికి వచ్చి చుట్టుపుచూపుగా పరిశీలించి వెళ్లిపోతున్నారు. ఆస్పత్రిలో రోజువారీ పరిస్థితులను తెలుసుకునేందుకు ప్రత్యక్ష తనిఖీలు చేయడం లేదు. ఆస్పత్రి బాధ్యతలను ఓ వైద్యుడికి అప్పగించి.. అక్కడి నుంచే ఆన్‌లైన్‌లో పర్యవేక్షణ చేస్తున్నారు. దీంతో సూపరింటెండెంట్ హాజరు, పర్యవేక్షణ, పరిపాలనా బాధ్యతలపై తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆస్పత్రికి అధికారి అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది ఎవరికి వారు విధులు నిర్వహిస్తున్నారు. రోగుల సమస్యలు వినే అధికారి లేకపోవడం, వైద్య సేవలపై ఫిర్యాదులు స్వీకరించే వ్యవస్థ పనిచేయకపోవడం, సిబ్బంది హాజరును పరిశీలించే పర్యవేక్షణ లేకపోవడం రోజువారీ పరిస్థితిగా మారింది. ఆస్పత్రి నిర్వహణను ఓ వైద్యుడికి అప్పగించి సూపరింటెండెంట్ బాధ్యతల నుంచి తప్పుకోవడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నకు ఉన్నతాధికారులు సమాధానం చెప్పాలి.

**10 మంది డాక్టర్లు.. విధుల్లో ఇద్దరే**

ఈఎస్ఐ ప్రాంతీయ వైద్యశాలలో మొత్తం 10 మంది వైద్యులు విధులు నిర్వహించాల్సి ఉంది. కానీ ఆస్పత్రిలో ప్రతిరోజూ విధుల్లో కనిపించేది ఇద్దరు వైద్యులు మాత్రమే. మిగతా వైద్యులు విధులకు రాకున్నా హాజరు రికార్డుల్లో మాత్రం వంద శాతం హాజరు నమోదవుతోంది. వైద్యుల గైర్హాజరు కారణంగా రోగులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. వైద్య పరీక్షలు సక్రమంగా జరగడం లేదు. రోగుల సమస్యలను పూర్తిగా తెలుసుకోకుండానే మందులు ఇచ్చి పంపిస్తున్నారు. వైద్య సేవల కోసం వచ్చే కార్మికులకు జ్వరం, జలుబు, సాధారణ నొప్పులకు మాత్రమే మందులు అందుతున్నాయి. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్నా, ప్రత్యేక వైద్యుడి అవసరం ఉన్నా, శస్త్రచికిత్స చేయాల్సి వచ్చినా ఎంజీఎం ఆస్పత్రికి వెళ్లాలని సూచిస్తున్నారు. ఈఎస్ఐ ఆస్పత్రిలోనే అందాల్సిన వైద్య సేవలు అందకపోవడంతో కార్మికులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీమా సౌకర్యం ఉన్నప్పటికీ వైద్యం కోసం అదనపు ఖర్చులు చేయాల్సి వస్తోంది.

**మధ్యాహ్నం తర్వాత నర్సింగ్ సిబ్బంది గాయబ్**

వైద్యుల గైర్హాజరుతో పాటు నర్సింగ్ సిబ్బంది హాజరు కూడా సక్రమంగా లేదు. ఉదయం వేళ కొంతమంది నర్సులు ఆస్పత్రిలో కనిపించినా.. మధ్యాహ్నం తర్వాత సిబ్బంది సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. మధ్యాహ్నం తర్వాత ఆస్పత్రిలో ఇద్దరు అటెండర్లు, నలుగురు నర్సులు మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. వారిలోనూ వారానికి ఒకసారి చొప్పున వంతుల వారీగా విధులు నిర్వహిస్తున్నారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగుల బాధ్యత నర్సులు, అటెండర్లపైనే పడుతోంది. ఇంజెక్షన్లు, డ్రెస్సింగ్, మందుల పంపిణీ, రోగుల పర్యవేక్షణ వంటి పనులను పరిమిత సిబ్బందే నిర్వహించాల్సి వస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో వైద్యుడు అందుబాటులో లేకపోవడం రోగులకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. సిబ్బంది కొరత ఉన్నా అదనపు నియామకాలు చేపట్టడం లేదు. విధులకు రాని సిబ్బందిపై చర్యలు తీసుకోకుండా హాజరు నమోదు చేయడం ఆస్పత్రి నిర్వహణలోని లోపాలను స్పష్టం చేస్తోంది.

**హాజరు రికార్డులపై సమగ్ర విచారణ అవసరం**

వైద్యులు, సిబ్బంది విధులకు రాకున్నా హాజరు రికార్డుల్లో వంద శాతం హాజరు ఎలా నమోదవుతోందనే ప్రశ్నకు సమాధానం లేదు. హాజరు పుస్తకాలు, బయోమెట్రిక్ వివరాలు, విధుల పట్టికలు, జీతాల బిల్లులను ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలించాలి. విధులకు హాజరుకాని వారికి జీతాలు చెల్లించారా? హాజరు నమోదు చేస్తున్నది ఎవరు? సూపరింటెండెంట్ పర్యవేక్షణ లేకుండా రికార్డులు ఎలా నిర్వహిస్తున్నారు? అనే అంశాలపై విచారణ జరపాలి. ఆస్పత్రిలో నెలకొన్న పరిస్థితులపై ప్రభుత్వం, కార్మిక రాజ్య బీమా సంస్థ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి. ముందస్తు సమాచారం లేకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి. ఉదయం మాత్రమే కాకుండా మధ్యాహ్నం, రాత్రి వేళల్లోనూ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది హాజరును పరిశీలించాలి. సూపరింటెండెంట్ విధులకు హాజరవుతున్న తీరుపైనా విచారణ జరిపి బాధ్యతలు సక్రమంగా నిర్వహించే అధికారిని నియమించాలి. కార్మికుల ఆరోగ్య భద్రత కోసం ఏర్పాటు చేసిన ఈఎస్ఐ ఆస్పత్రిని నిర్లక్ష్యానికి వదిలేయకుండా.. పూర్తిస్థాయి వైద్య సేవలు అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలి అని అంటున్నారు.

## గ్రామాల అభివృద్ధిలో ప్రభుత్వం విఫలం

### కాట్రపల్లి సమస్యలు పరిష్కరించాలి



**అక్షరశక్తి, మహబూబాబాద్:** కాట్రపల్లి గ్రామ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు గడ్డం నాగార్జున ఆధ్వర్యంలో మంగళవారం మహబూబాబాద్ అదనపు కలెక్టర్ కె. అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా కాట్రపల్లి గ్రామ అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉందని ఆరోపించారు. కాట్రపల్లి -అప్పనపల్లి, కాట్రపల్లి -రాజన్‌పల్లి మధ్య వాగులపై హైలెవల్ బ్రిడ్జిలు నిర్మించాలని కోరారు. కాట్రపల్లి ఊరచెరువుకు కెనాల్ పాయింట్ కేటాయించాలని, ప్రతి కాలనీలో సైడ్ కాలువలు నిర్మించాలని డిమాండ్ చేశారు. శివకోటేశ్వరాయ దేవాలయ నిర్మాణంలో అవకతవకలు జరగకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని, పొట్టి మర్రి చెట్టు నుంచి బతుకమ్మ ఆటస్థలం వరకు సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. శంకుస్థాపన చేసి నిలిపివేసిన మహిళా సంఘ భవన నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని, కాట్రపల్లి హైస్కూల్‌లో మధ్యంతరంగా నిలిచిపోయిన మరుగుదొడ్ల పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అర్పనపల్లి నుంచి కాట్రపల్లి వరకు ఆర్అండ్‌బీ రోడ్డును మరమ్మతు చేయాలని, గ్రామంలోని శ్రీ సాయి బాలాజీ గ్రానైట్‌ను మూసివేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి నుంచి సర్పంచ్ వరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నా గ్రామాన్ని అభివృద్ధి చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎదురబోయిన యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ విచారణ ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్ రవి

**అక్షరశక్తి, హన్మకొండ :** ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)ప్రక్రియలో భాగంగా హనుమకొండ న్యూరాయపుర లోని 78వ పోలింగ్ కేంద్రంలో నో మ్యాపింగ్, అనామాలీస్ జాబితాలోని ఓటర్ల కోసం ఏర్పాటు చేసిన విచారణ కేంద్రంలో కొనసాగుతున్న విచారణ ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అనామాలీస్, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలు, నోటీసుల జారీ, ఇప్పటి వరకూ ఎంతమంది ఓటర్లు ధ్రువ పత్రాలు సమర్పించారు, ఎన్ని విచారణ చేశారు, ఇంకా ఎన్ని చేయాల్సి ఉందనే వివరాలను ఏఈఆర్వోలు, బీఎల్వోలను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జాబితాలోని ఓటర్లు సమర్పించిన ధ్రువ పత్రాల విచారణ ప్రక్రియను పరిశీలించారు. విచారణ ప్రక్రియకు హాజరైన ఓటర్లతో అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ మ్యాపింగ్ కాని, అనామాలీస్ జాబితాలో ఉన్న ఓటర్ల ధ్రువ పత్రాల పరిశీలన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జాబితాలో ఉన్న ఓటర్లు సమర్పించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి తుది ఓటర్ల జాబితాలో ఉండేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ ఏఈఆర్వో/తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఏఈఆర్వో నాగరాజు, బీఎల్వో సూపర్వైజర్ కవిత, బీఎల్వోలు పాల్గొన్నారు.

## ఎంఏ తెలుగు కోర్సు అడ్మిషన్ల గడువు పొడిగింపు

**అక్షరశక్తి, వరంగల్:** వరంగల్ హంటర్ రోడ్ లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో 20262027 విద్యా సంవత్సరానికి ఎంఏ తెలుగు రెగ్యులర్ కోర్సు లో ప్రవేశానికి గాను ఈ నెల 21 వరకు గడువు పొడిగించినట్లు జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ఆచార్య గడ్డం వెంకన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో పాటు రెండు సెట్ల జిరాక్స్ ప్రతులు, మూడు పాస్ పోర్టు సైజు ఫోటోలు తీసుకొని రావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం 99891 39136, 99894 17299 సెల్ నెంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు.

# జఫర్‌గడ్‌కు గోదావరి జలాలు

- వచ్చే వర్షా కాలం నాటికి 6ఎల్, 7ఎల్ కాలువల పనులు పూర్తి
- పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: కడియం శ్రీహరి



**అక్షరశక్తి, జఫర్‌గడ్, సెప్టెంబర్ 15 :** పేద ప్రజల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేద, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. జఫర్‌గడ్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కల్యాణలక్ష్మి-షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జఫర్‌గడ్ మండలంతో పాటు ఐనవోలు మండలంలోని వెంకటాపూర్, గర్నేపల్లి గ్రామాలకు చెందిన 42 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు రూ.42.04 లక్షల విలువైన చెక్కులు, 32 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.13 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం నుంచి సీఎంఆర్ఎఫ్ నిధులను అత్యధికంగా తీసుకువస్తున్నామని తెలిపారు. ప్రతి నెల సుమారు 150 కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్, మరో 50 కుటుంబాలకు ఎల్ఓసీల ద్వారా కలిపి దాదాపు కోటి రూపాయల మేర ఆర్థిక సాయం అందుతున్నట్లు వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో కరువు ప్రభావం లేకుండా సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. వచ్చే వర్షాకాలం నాటికి 6ఎల్, 7ఎల్ కాలువల పనులు పూర్తి చేసి జఫర్‌గడ్ ప్రాంతానికి గోదావరి జలాలు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తీగల కరుణాకర్‌రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, తహసీల్దార్, ఎంపీడీవో, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# రావి ఆకులతో వినాయకుడు






**అక్షరశక్తి,హనుమ-కొండ:** వినాయక చవితిని పురస్కరించుకొని నయీంనగర్ ప్రాంతానికి చెందిన లాస్య సాయి ప్రకాశ్ రావి ఆకులతో వినాయకుడి ప్రతిమను తయారు చేసి అందరి ప్రశంసలు అందుకుంది. సర్కార్ బడి ఉపాధ్యాయుడు కూరపాటి సత్య ప్రకాశ్ రావు కుమార్తె అయిన లాస్య, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే విధంగా వినూత్నంగా రావి ఆకులతో గణనాథుడిని రూపొందించింది. పర్యావరణానికి హాని కలిగించని విధంగా వినాయక ప్రతిమలను తయారు చేసుకోవాలనే సందేశాన్ని లాస్య తన ప్రయత్నం ద్వారా చాటిచెప్పింది. రావి ఆకులతో రూపొందించిన వినాయకుడిని చూసిన పలువురు ఆమెను అభినందిస్తూ శభాష్ అన్నారు. ప్రతి సంవత్సరం వినాయక చవితి సందర్భంగా పర్యావరణహితంగా గణనాథుడి ప్రతిమలను తయారు చేస్తానని లాస్య సాయి ప్రకాశ్ తెలిపింది. చిన్న వయసులోనే పర్యావరణ పరిరక్షణపై అవగాహనతో వినూత్నంగా ఆలోచిస్తున్న లాస్యను తల్లిదండ్రులు, స్థానికులు అభినందించారు.

# కేయూ ప్రాంగణంలో బర్రెలను కట్టివేత



**అక్షరశక్తి, కేయూ క్యాంపస్ :** కాకతీయ యూనివర్సిటీ ప్రాంగణంలోకి తరచూ బర్రెలు రావడంతో విద్యార్థులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల రాత్రి సమయంలో సుమారు 15 బర్రెలను సెక్యూరిటీ సిబ్బంది పట్టుకుని కేయూ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం వద్ద కట్టివేశారు. పలివెల్పుల గ్రామానికి చెందిన కొందరు బర్రెలు తమవేనని యూనివర్సిటీ అధికారులను సంప్రదించి, జరిమానా చెల్లించి ఎనిమిది బర్రెలను తీసుకెళ్లినట్లు సమాచారం. మిగతా బర్రెలను తీసుకెళ్లేందుకు యజమానులు ఎవరూ ముందుకు రాలేదు. యూనివర్సిటీ ప్రాంగణంలోకి బర్రెలు రాకుండా యజమానులపై జరిమానాలు విధించాలని రిజిస్ట్రార్ ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ ఘటన కేయూలో చర్చనీయాంశంగా మారింది.

# 'కల్పిత నాయకుడు' పుస్తకాన్ని బ్యాన్ చేయాలి

- హమారా ప్రసాద్‌పై రాజద్రోహం కేసు పెట్టాలి
- దళిత బహుజన ప్రజా సంఘాల డిమాండ్




**అక్షరశక్తి, హనుమకొండ:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కించపరిచేలా 'కల్పిత నాయకుడు' పేరుతో పుస్తకం రచించిన హమారా ప్రసాద్‌పై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రాజద్రోహం కేసు నమోదు చేసి తీహార్ జైలుకు పంపాలని దళిత, బహుజన ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. పుస్తకాన్ని బ్యాన్ చేసి విడుదల కాకుండా చూడాలని కోరాయి. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ విగ్రహాల పరిరక్షణ కమిటీ ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ బండి అశోక్ అధ్యక్షతన నిరసన, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల బాధ్యులు మాట్లాడుతూ హమారా ప్రసాద్‌ను బీజేపీ నాయకులు పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు. గత కొన్నేళ్లుగా అంబేద్కర్‌ను అవమానపరుస్తూ మనువాదుల చెప్పుచేతల్లో పావుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రపంచ దేశాలు గర్వించదగ్గ మహనీయుడైన అంబేద్కర్‌ను అవమానిస్తున్న వ్యక్తికి, ఆయనకు మద్దతు ఇస్తున్న వారికి దేశంలో జీవించే హక్కు లేదని అన్నారు. సెప్టెంబర్ 18న హైదరాబాద్‌లో హమారా ప్రసాద్ నిర్వహించనున్న పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. రిజర్వేషన్ల ద్వారా చట్టసభల్లో ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రధాన రహదారిపై సుమారు అరగంటపాటు రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్ స్తంభించింది. సుబేదారి సీఐ ఎం. రంజిత్‌కుమార్, ట్రాఫిక్ సీఐ వెంకన్న తదితర పోలీసులు అక్కడికి చేరుకుని సంఘాల బాధ్యులతో చర్చించి ఆందోళనను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, గ్రేటర్ వరంగల్ మాజీకార్పొరేటర్ జోరిక రమేష్, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య, డీబీఎఫ్ నాయకులు రౌతు రమేష్, చుంచు రాజేందర్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు పెరుమాండ్ల రామకృష్ణ, అరూరి సాంబయ్య, రైల్వే జేఏసీ కొండ్ర నర్సింగరావు, వివిధ సంఘాల బాధ్యులు కడారి కుమార్, ప్రభాకర్, దండ్రి శ్రీనివాస్, పనికేల శ్రీనివాస్, మంద వీరస్వామి, సాధు కుమారస్వామి, సింగారపు రవిప్రసాద్, మాదాసు సురేష్, పోతుల కొమ్మలు, అంకుస్ రవి, కేడల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం తరలింపు ప్రక్రియ పకడ్బందీగా ఉండాలి

- హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి

**అక్షరశక్తి, హన్మకొండ :** ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు తరలింపు ప్రక్రియ పకడ్బందీగా ఉండేలా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి పౌర సరఫరాలు, సహకార శాఖల అధికారులు, ధాన్యం కొనుగోలు కాంట్రాక్టర్లను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు తరలింపు ప్రక్రియపై జిల్లా పౌర సరఫరాల శాఖ, ధాన్యం కాంట్రాక్టర్లతో సమావేశాన్ని అదనపు కలెక్టర్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం తరలించే వాహనాలకు తప్పనిసరిగా జీపీఎస్ ను ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం తరలింపులో ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. స్టోరేజ్ పాయింట్లలో ధాన్యం నిల్వ అవసరాలకు ఉపయోగపడే స్థలాలను సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. సీజన్ లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. వాహనాల డ్రైవర్ల సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపయోగంలో లేని ఫంక్షన్ హాళ్లు, సినిమా హాళ్ళను స్టోరేజ్ పాయింట్లుగా వినియోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మహేందర్, జిల్లా సహకార అధికారి మోహన్, సివిల్ సప్లై డీటీలు భద్రు నాయక్, నాగేంద్ర ప్రసాద్, భాస్కర్ రెడ్డి, ధాన్యం కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# టీజీఎన్‌పీడీసీఎల్‌కు రెండు ప్రతిష్టాత్మక జాతీయ అవార్డులు





**అక్షరశక్తి,హనుమకొండ:** విద్యుత్ పంపిణీ రంగంలో కృత్రిమ మేధస్సు (AI), డ్రోన్ టెక్నాలజీ, డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతలను విస్తృతంగా వినియోగిస్తూ మెరుగైన సేవలు అందిస్తున్న టీజీఎన్‌పీడీసీఎల్‌కు రెండు ప్రతిష్టాత్మక జాతీయ అవార్డులు లభించాయి. అడాప్టింగ్ AI ఇన్ ఎనర్జీ, సౌత్ ఇండియా పీఎస్‌యూ అండ్ గవర్నెన్స్ ఎక్సలెన్స్ అవార్డులను సంస్థ సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్లు, సీజీఎం, సీఎస్ తదితర అధికారులు అవార్డులను సంస్థ సీఎండీ కర్ణాటి వరుణ్ రెడ్డి ఐఏఎస్‌కు అందజేశారు. ఈ నెల 9న బెంగళూరులో టైమ్స్ ఆస్పైర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సౌత్ ఇండియా పీఎస్‌యూ అండ్ గవర్నెన్స్ ఎక్సలెన్స్ అవార్డును కంపెనీ సెక్రటరీ కె. వెంకటేశం అందుకోగా, 10న ది ఎకనామిక్ టైమ్స్ ఆధ్వర్యంలో అడాప్టింగ్ AI ఇన్ ఎనర్జీ అవార్డును సీఈ సురేందర్ స్వీకరించారు. సీఎండీ కర్ణాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ.. టీజీఎన్‌పీడీసీఎల్‌లో అమలు చేస్తున్న AI ఆధారిత ఫీడర్ విద్యుత్ అంతరాయాల ముందస్తు అంచనా, డ్రోన్ ఆధారిత విద్యుత్ ఆస్తుల పర్యవేక్షణ, రియల్‌టైమ్ ఫీడర్ నిర్వహణ వ్యవస్థ, GIS ఆధారిత పర్యవేక్షణ, 24/7 AI వాట్సాప్ చాట్‌బాట్, సబ్‌స్టేషన్ లోడింగ్ అనలిటిక్స్, ఉద్యోగుల కోసం AI సహాయకుడు వంటి ఆధునిక విధానాలకు అడాప్టింగ్ AI ఇన్ ఎనర్జీ అవార్డు లభించిందన్నారు. అలాగే నెట్‌వర్క్ మౌలిక వసతుల విస్తరణ, ఇంటర్‌లింకింగ్ లైన్లు, విపత్తు సన్నద్ధత ప్రణాళిక, కవర్డ్ కండక్టర్ పనులు, ఫీడర్ ఔటేజ్ ప్రిడిక్షన్ మోడల్, భద్రత, వినియోగదారుల సేవల మెరుగుదల, సౌర విద్యుత్ ప్రోత్సాహం, డిజిటల్ సాంకేతికత, ప్రతిభకు గుర్తింపుగా సౌత్ ఇండియా పీఎస్‌యూ అండ్ గవర్నెన్స్ ఎక్సలెన్స్ అవార్డు దక్కిందని తెలిపారు. ఈ రెండు జాతీయ అవార్డులు టీజీఎన్‌పీడీసీఎల్‌కు జాతీయ స్థాయిలో లభిస్తున్న గుర్తింపును మరింత బలోపేతం చేయడంతో పాటు, సాంకేతికత, ఆవిష్కరణలు, డిజిటల్ పరివర్తనలో సంస్థను ముందంజలో నిలబెడుతున్నాయని సీఎండీ పేర్కొన్నారు. అవార్డులు సంస్థ అధికారులు, ఇంజినీర్లు, సిబ్బంది సమష్టి కృషికి నిదర్శనమని తెలిపారు. భవిష్యత్తులోనూ ఆధునిక సాంకేతికతను మరింత విస్తృతంగా వినియోగిస్తూ వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వి. తిరుపతి రెడ్డి, టి. మధుసూదన్, సి. ప్రభాకర్, సీఈ సురేందర్, సీఎస్ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

GUEST COLUMN


# అరుపులు, కేకల జర్నలిజానికి అర్నబ్ గోస్వామి ఓ ప్రతీక

టెలివిజన్ జర్నలిజంలో యాంకర్ పని వార్తను అరిచి చెప్పడం కాదు. వార్త వెనుక ఉన్న వాస్తవాలను వెలికితీయడం. చర్చను కేకల పోటీగా మార్చడం కాదు; భిన్నాభిప్రాయాలను ఆధారాలతో సహా ఎదురెదురుగా నిలబెట్టడం. కానీ భారత టెలివిజన్ జర్నలిజంలో అర్నబ్ గోస్వామి నిర్మించిన మోడల్ ఈ ప్రాథమిక సూత్రాలనే తలకిందులు చేసిందన్న విమర్శ చాలాకాలంగా ఉంది. రిపబ్లిక్ టీవీ ప్రైమ్‌టైమ్‌లో ప్రశ్నకంటే తీర్పు ముందుంటుంది. వాదనకంటే అరుపు ఎక్కువగా వినిపిస్తుంది, ఆధారాలకంటే రాజకీయ లేబుళ్లు పెద్దగా కనిపిస్తాయి. అందుకే ఈ శైలి జర్నలిజమా?, లేక టీఆర్పీ కోసం రూపొందించిన రాజకీయ టెలివిజన్ 'షో' నా ?అన్న ప్రశ్న తప్పనిసరిగా తలెత్తుతోంది.

అర్నబ్ గోస్వామి ప్రత్యేకతగా చెప్పకునే "హై-వోల్టేజ్" జర్నలిజం వాస్తవానికి ప్రేక్షకుడి భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రసార శైలిగా మారిందని విమర్శకులు చాలాకాలంగా చెబుతున్నారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ వంటి రాజకీయ ప్రత్యర్థులపై ఆయన నిర్వహించే కార్యక్రమాల్లో ఈ ధోరణి మరింత స్పష్టంగా కనిపిస్తుంది. రాజకీయ ప్రత్యర్థిపై కఠినమైన ప్రశ్నలు వేయడం ఎంత మాత్రం తప్పు కాదు. కానీ ఒక జర్నలిస్టు ప్రశ్నించే వ్యక్తి స్థానాన్ని దాటి రాజకీయ ప్రత్యర్థిని ముందుగానే దోషిగా చిత్రించే స్థాయికి వెళ్లినప్పుడు జర్నలిజం, రాజకీయ ప్రచారం మధ్య ఉన్న సరిహద్దును చెరిపేస్తుంది.

రాహుల్ గాంధీపై రిపబ్లిక్ టీవీ కార్యక్రమాల్లో తరచుగా కనిపించే పదజాలం దీనికి ఉదాహరణగా నిలుస్తోంది. ఆయన రాజకీయ నిర్ణయాలను, కాంగ్రెస్ వ్యూహాలను, ప్రతిపక్ష పాత్రను ఆధారాలతో విమర్శించవచ్చు. కానీ వ్యక్తిని ఎగతాళి చేయడం, పదేపదే అవమానకరమైన విశేషణాలతో సంబోధించడం, ఒక రాజకీయ నాయకుడి ప్రతిష్ఠను దెబ్బతీయడమే కార్యక్రమానికి ప్రధాన ఉద్దేశ్యంగా కనిపించేలా చర్చను నడపడం మాత్రం జర్నలిజం ప్రమాణాలపై ప్రశ్నలు లేవనెత్తుతుంది. అదే విధంగా కాంగ్రెస్ పార్టీని విమర్శించడం ప్రజాస్వామ్యంలో సహజం. కానీ విమర్శలకు ఆధారాలు ఉండాలి. అంతే కానీ యాంకర్ సంయమనం కోల్పోయి తన ఆగ్రహాన్నే ప్రదర్శించడమే టీవీ షో లక్ష్యం కాకూడదు.

అర్నబ్ మోడల్‌లో అత్యంత స్పష్టంగా కనిపించే అంశం "అరుపును వాదనగా మార్చడం". ఒక ప్యానలిస్టు మాట్లాడుతుంటే మధ్యలో అడ్డుకోవడం. ఒకేసారి పలువురితో మాట్లాడించడం. సమాధానం పూర్తికాకముందే మరో ప్రశ్న సంధించడం.




తెరపై పెద్ద అక్షరాలతో రెచ్చగొట్టే పదాలను ప్రదర్శించడం. యాంకర్ స్వరాన్నే చర్చకు కేంద్రంగా మార్చడం. ఇవి ప్రేక్షకుడికి ఉత్కంఠ కలిగించవచ్చునేమో కానీ, చర్చలోని అసలు విషయం మాత్రం ఆ గందరగోళంలో కనిపించకుండా పోతుంది. రాయిటర్స్ ఇన్‌స్టిట్యూట్ కూడా భారత టెలివిజన్ వార్తల్లో పెరుగుతున్న దూకుడు, ప్రజాకర్షక రాజకీయ ప్రసార శైలిపై పరిశీలన చేస్తూ రిపబ్లిక్ టీవీ చర్చలను ఉదాహరణగా ప్రస్తావించింది.

ఇక్కడ అసలు ప్రశ్న టీఆర్పీ సంస్కృతిపై. వార్తను ఎంత బాగా పరిశోధించామన్నదికంటే, ఎంత మంది చూశారన్నదే ప్రధాన ప్రమాణంగా మారితే జర్నలిజం సహజంగానే సంచలనాత్మకత వైపు పరుగెడుతుంది. 2020లో రిపబ్లిక్ టీవీకి సంబంధించి టీఆర్పీ రేటింగ్‌స్‌ను ప్రభావితం చేశారన్న ఆరోపణలతో ముంబై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ వ్యవహారంలో తీవ్రమైన ఆరోపణలు నమోదయ్యాయి. అర్నబ్ గోస్వామి, రిపబ్లిక్ టీవీ మాత్రం ఆరోపణలను ఖండించారు. తరువాత ఈ దర్యాప్తు పద్ధతిపైనా ప్రశ్నలు తలెత్తాయి. కాబట్టి దీనిని తుది నేర నిర్ధారణగా చెప్పడం సరైంది కాదు. కానీ ఒక వార్తా సంస్థ తన ప్రేక్షకాదరణను ఎలా సంపాదిస్తోంది అన్న ప్రశ్న ఇంత పెద్ద వివాదంగా మారడం మాత్రం మీడియా నైతికతకు హెచ్చరిక.

రిపబ్లిక్ టీవీపై వచ్చిన విమర్శలు కేవలం భారతదేశానికే పరిమితం కాలేదు. బ్రిటన్ ప్రసార నియంత్రణ సంస్థ ఆఫ్కామ్ ఒక రిపబ్లిక్ ప్రసారానికి పక్షపాతపూరిత, అవమానకరమైన వ్యాఖ్యల విషయంలో జరిమానా విధించింది. అంతర్జాతీయ మీడియా కూడా భారత టెలివిజన్ చర్చల్లో పెరుగుతున్న "మీడియా ట్రయల్స్", అరుపుల సంస్కృతి, రాజకీయ ధ్రువీకరణపై అనేక సందర్భాల్లో దృష్టి పెట్టింది. అంటే సమస్య కేవలం అర్నబ్ గోస్వామి వ్యక్తిగత శైలికి సంబంధించినది కాదు. ఆయన ప్రాచుర్యం పొందిన ప్రసార విధానం భారత టెలివిజన్ జర్నలిజంపై చూపుతున్న ప్రభావం కూడా పరిశీలించాల్సిన అంశమే.

అర్నబ్‌పై, రిపబ్లిక్ టీవీ ప్రసారాలపై వివిధ సందర్భాల్లో అనేక ఫిర్యాదులు, కేసులు నమోదయ్యాయి. కేసు నమోదవడం నేర నిర్ధారణ కాదన్న విషయం స్పష్టంగా గుర్తుంచుకోవాలి. అదే సమయంలో కేసులు నమోదయ్యాయనే వాస్తవాన్ని పూర్తిగా రాజకీయ కుట్రగా కొట్టిపారేయడం కూడా సరైన పద్ధతి కాదు. ప్రతి కేసును దాని ఆధారాలు, దర్యాప్తు, న్యాయస్థానాల నిర్ణయాల ప్రకారం మాత్రమే అంచనా వేయాలి. జర్నలిస్టుకు చట్టపరమైన హక్కులు ఉన్నట్లే, ప్రజల పట్ల బాధ్యత కూడా ఉంటుంది.

ఇంకో ప్రమాదకరమైన విషయం ఏమిటంటే, ఈ అర్నబ్ మోడల్‌ను అనుకరించడానికి ఇతర టెలివిజన్ ఛానళ్లు ప్రయత్నించడం. ఒక యాంకర్ అరుస్తాడు. ప్రేక్షకులు ఉత్కంఠతో చూస్తారు. ప్రేక్షకాదరణ పెరుగుతుంది. ప్రకటనలు పెరుగుతాయి. అప్పుడు ప్రశాంతమైన, పరిశోధనాత్మకమైన, ఆధారపూర్వకమైన జర్నలిజం కంటే ఘర్షణాత్మకమైన ప్రసారం వ్యాపారపరంగా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఫలితంగా వార్త ఒక సమాచార సాధనం నుంచి వినోద వస్తువుగా మారుతుంది. ప్రజాస్వామ్యానికి కావాల్సిన స్వతంత్ర మీడియా స్థానంలో రాజకీయ ధ్రువీకరణను పెంచే ప్రసార పరిశ్రమ ఏర్పడే ప్రమాదం ఉంది.

సామాజిక మాధ్యమాల్లో అర్నబ్ గోస్వామిపై వ్యంగ్య చిత్రాలు, మీమ్స్, విమర్శలు విస్తృతంగా కనిపించడం కూడా ఆయన శైలిపై ఉన్న ప్రజా ప్రతిస్పందనలో ఒక భాగం. అయితే సామాజిక మాధ్యమాల మీమ్‌స్‌ను ప్రజాభిప్రాయానికి శాస్త్రీయ కొలమానంగా చూడలేం. అసలు ప్రశ్న మరింత తీవ్రమైనది. ప్రేక్షకులు ఆ కార్యక్రమాలను చూస్తున్నారా? లేదా ? అన్నది కాదు. వారు నిజమైన, సమతుల్యమైన, ఆధారపూర్వకమైన సమాచారాన్ని పొందుతున్నారా ? లేదా? అన్నదే ప్రధానాంశం.

జర్నలిజం అంటే అధికార పక్షాన్ని ప్రశ్నించడం. అలాగే ప్రతిపక్షాన్ని ప్రశ్నించడం కూడా జర్నలిజంలో భాగమే. ఒకే ప్రమాణాన్ని అధికారానికి, ప్రతిపక్షానికి వర్తింపజేయడమే నిజమైన నిష్పాక్షికత. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించినప్పుడు దేశద్రోహం కాదు; ప్రతిపక్షాన్ని ప్రశ్నించినప్పుడు కూడా ప్రజాస్వామ్య వ్యతిరేకత కాదు. కానీ ప్రశ్నించే వ్యక్తి తన రాజకీయ అభిప్రాయాన్ని వార్తగా, తన కోపాన్ని విశ్లేషణగా, తన తీర్పును ప్రజా తీర్పుగా మార్చకూడదు.

అర్నబ్ గోస్వామి వ్యక్తిగత ప్రజాదరణ ఎంత ఉన్నా, ఆయన నిర్మించిన అరుపుల మోడల్ భారత మీడియాకు ఆదర్శంగా మారడం మాత్రం ప్రమాదకరం. ఎందుకంటే జర్నలిస్టు గొంతు ఎంత పెద్దదైనా నిజం అంత పెద్దది కాదు. యాంకర్ కోపం ఎంత తీవ్రంగా ఉన్నా ఆధారం దానికంటే బలమైనది. తెరపై పదాలు ఎంత పెద్దగా కనిపించినా వాస్తవం వాటి కంటే పెద్దది.

అరుపు వార్త కాదు. సంచలనం సత్యం కాదు. రాజకీయ నినాదం విశ్లేషణ కాదు. ప్రత్యర్థిని అవమానించడం, దభాయించడం జర్నలిజం కాదు. టీఆర్పీ కోసం ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టడం ప్రజాసేవ కాదు.

ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగో స్థంభంగా నిలవాలంటే అది అధికారాన్ని మాత్రమే కాదు, తనను తాను కూడా ప్రశ్నించుకోవాలి. లేదంటే "దేశం కోసం గొంతెత్తుతున్నాం" అనే నినాదం వెనుక అసలు మిగిలేది దేశ ప్రయోజనం కానేకాదు. తన గొంతు ఎక్కువగా వినిపించాలనే తాపత్రయం మాత్రమే.



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
ramkishore.1504@gmail.com

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.

# హన్మకొండకు మహా అభివృద్ధి ప్రణాళిక

హన్మకొండ నగరంలో పెరుగుతున్న పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు మల్టీలెవల్ పార్కింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నామని హన్మకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్మన్ ఐఏఎస్ చాహత్ బాజ్‌పేయి వెల్లడించారు. హన్మకొండ అశోక హోటల్‌కు ఎదురుగా ఉన్న కుడా స్థలంలో మల్టీలెవల్ కార్ పార్కింగ్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయని, ముందు భాగాన్ని వాణిజ్య అవసరాలకు వినియోగించేలా రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. అదే తరహాలో హన్మకొండ చౌరస్తాలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రాంతాన్ని కూడా అభివృద్ధి చేసే ఆలోచన ఉందన్నారు. నగర అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. మంగళవారం హన్మకొండ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో జిల్లా, నగర అభివృద్ధి పనులపై ఆమె వివరాలు వెల్లడించారు.

- అక్షరశక్తి, హన్మకొండ



## పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం

### అశోక హోటల్ ఎదురుగా మల్టీలెవల్ పార్కింగ్


- హన్మకొండ చౌరస్తా రీడెవలప్‌మెంట్‌కు కార్యాచరణ
- అండర్ డ్రైనేజీ, వాటర్ వర్క్స్‌కు అధిక ప్రాధాన్యం
- భద్రకాళి, వరంగల్ కోట, దేవునూరు గుట్టలపై ప్రత్యేక దృష్టి
- హన్మకొండ జిల్లా కలెక్టర్,కుడా వైస్ చైర్మన్ చాహత్ బాజ్‌పేయి

### అశోక హోటల్ ఎదురుగా మల్టీలెవల్ పార్కింగ్

హన్మకొండలో పార్కింగ్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోందని చాహత్ బాజ్‌పేయి తెలిపారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు మల్టీలెవల్ పార్కింగ్ వ్యవస్థను అమలు చేసే దిశగా ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. అశోక హోటల్‌కు ఎదురుగా ఉన్న కుడా స్థలంలో ఈ నిర్మాణాన్ని చేపట్టేందుకు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. పార్కింగ్ కోసం మాత్రమే స్థలాన్ని వినియోగించకుండా ముందు భాగంలో వాణిజ్య దుకాణాలను ఏర్పాటు చేసి లీజుకు ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నామని తెలిపారు. దీనివల్ల ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడకుండా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని వివరించారు. పార్కింగ్ సమస్య పరిష్కారంతో పాటు నగరంలోని వాణిజ్య కార్యకలాపాలకు కూడా ఊతమిచ్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు.

### నగర తాగునీటి వ్యవస్థకు రూ.500 కోట్లు

గ్రేటర్ వరంగల్ వాటర్ వర్క్స్ అభివృద్ధికి ప్రభుత్వం కొత్తగా రూ.500 కోట్లు మంజూరు చేసిందని కలెక్టర్ తెలిపారు. రాబోయే 30 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిధులతో పనులు చేపట్టనున్నామని చెప్పారు. కొత్త పైపులైన్ల నిర్మాణం, పాత పైపులైన్ల మరమ్మతులు, నీటి సరఫరా వ్యవస్థ బలోపేతం, కొత్త నిర్మాణాలు, వాటర్ ట్యాంకులు, వాటర్ ప్లాట్ల ఏర్పాటు వంటి పనులకు నిధులను వినియోగించనున్నామని వివరించారు. నగరంలో 30, 40 ఏళ్ల భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలోనే ఈ పనులకు ప్రారంభోత్సవం చేయనున్నారని చెప్పారు.



### భద్రకాళి, వరంగల్ కోటకు పర్యాటక హంగులు

భద్రకాళి ఆలయ అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.90 కోట్ల ఎస్డీపీ నిధులు కేటాయించిందని చాహత్ బాజ్‌పేయి తెలిపారు. ఈ నిధులతో చేపట్టాల్సిన పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. భద్రకాళి ఆలయం ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా పర్యాటక ప్రాంతంగా కూడా మరింత అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. భద్రకాళి బండ్ వద్ద స్టోన్ వర్క్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ఇందుకోసం రూ.19 కోట్లతో టెండర్లు పిలిచామని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అభివృద్ధి పనులను ఆయనకు చూపించే ఆలోచన ఉందన్నారు. వరంగల్ కోట చుట్టూ ఉన్న సుమారు 4 కిలోమీటర్ల రక్షణ కందకాన్ని పునరుద్ధరించి బోటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఖిలా వరంగల్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రపంచ బ్యాంకు సహకారం తీసుకుంటున్నామని వెల్లడించారు. నగరంలో ముంపు సమస్యను తగ్గించేందుకు రిటర్న్ వాల్, డ్రైనేజీలు, నాలాల అభివృద్ధి పనులు కూడా చేపట్టామని వివరించారు.

### దేవునూరు గుట్టలు టూరిజం స్పాట్‌గా

ధర్మసాగర్ మండలంలోని దేవునూరు గుట్టలను అటవీశాఖ సహకారంతో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే ఆలోచన ఉందని కలెక్టర్ తెలిపారు. ధర్మసాగర్ రిజర్వాయర్‌తో పాటు అటవీ విస్తీర్ణం ఉన్న దేవునూరు గుట్టలను అభివృద్ధి చేస్తే ప్రజలకు ఆహ్లాదకరమైన ప్రదేశం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. దీనిపై గతంలోనే ప్రతిపాదనలు రూపొందించారని, ప్రస్తుతం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు.

### డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్వహణపై దృష్టి

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రగతిలో ఉందని, పనుల్లో మరింత వేగం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చాహత్ బాజ్‌పేయి తెలిపారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ వందశాతం పూర్తయిందని చెప్పారు. అయితే కొన్ని ప్రాంతాల్లో నీటి వసతి, డ్రైనేజీ సమస్యలు లబ్ధిదారులు తమ దృష్టికి తీసుకొస్తున్నారని తెలిపారు. అంబేద్కర్‌నగర్‌లోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కార్పొరేషన్ అధికారులు టెండర్లు పిలిచారని, త్వరలో పనులు పూర్తవుతాయని చెప్పారు. కేటాయించిన ఇళ్లలో లబ్ధిదారులు నివసిస్తున్నారా లేదా అనే అంశంపై ఆక్యుపెన్సీ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అర్హులైన వారు ఇళ్లను వినియోగించుకోవాలన్నదే ఈ ప్రక్రియ ఉద్దేశమన్నారు.

### బయోమైనింగ్, పారిశుధ్యానికి ప్రాధాన్యం


నగరంలో శానిటేషన్ క్లియరెన్స్‌ను సవాల్‌గా తీసుకుని పనిచేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. చెత్తను డంపింగ్ చేయకుండా బయోమైనింగ్, బయో సీఎజీ ప్లాంట్ల ఏర్పాటుపై దృష్టి పెట్టామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. డంపింగ్ యార్డు విషయంలో కొత్తగా వెతుకులాట చేయడం లేదని, అందుబాటులో ఉన్న వ్యవస్థను మెరుగుపరిచే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. నగర పరిశుభ్రత, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు.

### అర్హులైన ఓటర్ల పేర్లు తొలగకుండా చర్యలు

ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోందని, ఈ ప్రక్రియపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించామని చాహత్ బాజ్‌పేయి తెలిపారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. బూత్ లెవల్ అధికారులు కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని వెల్లడించారు. ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, అనర్హుల పేర్లను నిబంధనల ప్రకారం గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని సవరణలు అవసరమైతే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు.

### ఐఏఎస్ కావాలన్న లక్ష్యంతో సివిల్స్‌లోకి

మధ్యప్రదేశ్‌లోని గుణలో టెన్త్ వరకు చదువుకున్నానని, ఇంటర్ విద్యను గ్వాలియర్‌లో పూర్తి చేశానని చాహత్ బాజ్‌పేయి తెలిపారు. 2016లో ఐఐటీ కాన్పూర్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశానని చెప్పారు. తన తండ్రి ఇంజనీరింగ్ విభాగంలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేశారని, ఆయన ఉన్నతాధికారులతో పనిచేసిన అనుభవాలు, కలెక్టర్ స్థాయి బాధ్యతల గురించి చెప్పే విధానం తనపై ప్రభావం చూపిందన్నారు. ప్రజలకు ఎక్కువగా సేవ చేసే అవకాశం సివిల్ సర్వీసుల్లో ఉంటుందని భావించి ఆ దిశగా అడుగులు వేశానని తెలిపారు. ఇంజనీరింగ్ చివరి సంవత్సరంలోనే తొలిసారి సివిల్స్ పరీక్ష రాశానని, మూడో ప్రయత్నంలో విజయం సాధించానని చెప్పారు. సివిల్స్ శిక్షణ సమయంలోనే వరుణ్ రెడ్డితో పరిచయం ఏర్పడిందని తెలిపారు.



### హన్మకొండ చౌరస్తా రీడెవలప్‌మెంట్

హన్మకొండ చౌరస్తాను సమగ్రంగా రీడెవలప్‌మెంట్ చేయాలనే ఆలోచన ఉందని కలెక్టర్ తెలిపారు. చౌరస్తాలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌తో పాటు చుట్టుపక్కల ఉన్న ఖాళీ స్థలాలను కలుపుకొని ప్లాజా నిర్మాణం చేపట్టే ప్రతిపాదనపై ఆర్టీసీ అధికారులతో చర్చలు జరుపుతున్నామని చెప్పారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ దృష్టికి కూడా తీసుకెళ్లామని తెలిపారు. నగరానికి మరింత ఆకర్షణ తీసుకురావడంతో పాటు ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా, వాణిజ్య వసతులు కల్పించేలా చౌరస్తా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యమన్నారు. మల్టీలెవల్ పార్కింగ్, ప్లాజా నిర్మాణం పూర్తయితే హన్మకొండ ప్రధాన కూడలిలో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గే అవకాశం ఉందని వివరించారు.

### అండర్ డ్రైనేజీకి రూ.5 వేల కోట్ల ప్రాజెక్టు

హన్మకొండ, కాజీపేటతో పాటు గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో అండర్ డ్రైనేజీ పనులకు సంబంధించిన గ్రౌండ్ వర్క్ కొనసాగుతోందని చాహత్ బాజ్‌పేయి తెలిపారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూముల గుర్తింపు ప్రక్రియలో భాగంగా ఇప్పటికే దాదాపు 10 ఎకరాల భూమిని గుర్తించామని చెప్పారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని వర్షపు నీరు, మురుగునీటి నిర్వహణకు శాశ్వత పరిష్కారం చూపించడమే లక్ష్యంగా పనులను ముందుకు తీసుకెళ్తున్నామని వెల్లడించారు. అండర్ డ్రైనేజీ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, సంబంధిత అధికారులు పరిశీలన చేస్తున్నారని తెలిపారు. భారీ వ్యయంతో కూడిన ఈ ప్రాజెక్టును దశలవారీగా అమలు చేయనున్నామని చెప్పారు.